"స్వామీ! అవి పండటానికి నాలుగైదు రోజులు పడుతుంది. మీరు వాటిని మాటిమాటికీ బయటకి తీసి చూస్తూంటే అవి పండకపోగా కుళ్ళిపోవచ్చు."

"ముక్తి విషయంలో కూడా సరిగ్గా ఇలాగే జరుగుతుంది నాయినా. మనకి ముక్తి మీద కాక, దాన్ని సంపాదించే విధానం మీద ఆసక్తి వుండాలి." చెప్పాడు గురువు.

## 60. దృష్టికోణం

ఓ ఆశ్రమంలో ఓ గురువు తన శిష్యులకి ఆధ్యాత్మిక శిక్షణని ఇస్తున్నారు. సిగరెట్ తాగే అలవాటున్న ఓ శిష్యుడు చాలాసేపు జరిగే ప్రార్ధన సమయంలో సిగరెట్ తాగడానికి గురువుని అనుమతి కోరాడు. ఆయన అందుకు అనుమతిని ఇవ్వకుండా కారణం చెప్పాడు.

"ప్రార్ధన చేస్తూ సిగరెట్ తాగడం పాపం కాబట్టి ఆ పని ఎన్నడూ చేయక."

అయితే ప్రార్ధన సమయంలో క్లాసులో ఇంకో శిష్యుడు గురువు అనుమతితో సిగరెట్ తాగడం ఇతని కంటపడింది.

"సిగరెట్ తాగడానికి నీకు అనుమతి ఎలా లభించింది?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ శిష్యుడు.

"నీలా నేను ప్రార్ధన సమయంలో సిగరెట్ తాగడానికి అనుమతిని కోరలేదు. సిగరెట్ తాగేప్పుడు దైవ ప్రార్ధన చేయడానికి అనుమతిని అడిగాను." వివరించాడా రెండో శిష్యుడు.

ఇదేవిధంగా మన దృష్టికోణంలో చిన్న మార్పు చేసుకుంటే మన ఆధ్యాత్మిక ప్రగతి త్వరితం అవుతుంది.